చీకటి చారికలు వద్దు;

ఇలా పచ్చడి రుబ్బుకుంటూ తెగీ తెగని జ్ఞాపకాలను నెమరువేసుకుంటుంటే మనస్సు ఏదోలా పరవశించి పోతుంది. గాలికి ఎటో ఎటో తేలిపోతున్నట్లు వుంటుంది.

అప్పుడు మనం బీచ్చికి వెళ్ళేవాళ్ళం

బీచ్చి దగ్గర వేరుశనక్కాయలకి బేడా అప్పుపెట్టాను.

అప్పుడు మీకు కథ వ్రాసిన డబ్బొస్తే... నన్ను లైటు హవుస్ దగ్గర ఇంగ్లీషు సినిమాకి తీసుకెళ్ళారు. అదేనేమో మొదటిసారి ఇంగ్లీషు సినిమా చూడ్డం ఒళ్ళంతా కంపరమెత్తి పోయిందంటె నమ్మండి.

మాటలు ఎలాను తెలీవుకదా; ఆ మాట్లు మీక్కూడా అర్థవయివుండవులెండి (ఆ ఏడు ఇంగ్లీషులోనేగా పరీక్ష పోయిందీ). ఆ ఆడవాళ్ళు మొగవాళ్ళూ ఒకళ్లమీదొకళ్ళు పడిపోవడమేనా. వూరిఖే ముద్దులెట్టేసుకోవడమేనా... శ్రీరామా రామా - ఇంటికొచ్చాక స్నానం చేయాలనిపించింది. ఎవడు తండ్రో ఎవడు అన్నగారో, ఎవడుభర్తో తెలిసేదవదు. అత్తయ్యమొగం చూడలేక పోయాను. మహాపాపం చేసినట్లు ప్రహ్లాదో యోగి వేమనో పిక్చరు చూసేవరకు పుణ్యావచనం అయిందికాదు.

అబ్బ-ఏవిటో జ్ఞాపకాలూరిఖే వస్తున్నాయ్ ఈ పచ్చడి రుబ్బుతుంటె.

ఈ రుబ్బడం మానేస్తే ఈ జ్ఞాపకాలు రావడం మానేస్తాయ్ కాబోలు.

ఇదిగో ఏమండోయ్... మిమ్మల్నే పెసరపచ్చడి రుబ్బుతుంటే ఇలాటి భావాలు జ్ఞాపకాలొస్తున్నాయిగదా - కంది పచ్చడి రుబ్బుతుంటె ఇంకెలాంటి భావాలొస్తాయో?

మాటాడరేవండి? బెల్లం కొట్టిన రాయిలాగా (క్షమించాలి; బెల్లం కాఫీతాగిన అని వుండాలి)

# నుదుటన్ వ్రాసిన వ్రాలు - దడిగాడు వానసిరా

ఆరణాలన్నర లేకపోతే అర్ధరూపాయకు దొరికే కొబ్బరికాయకు ముక్కూ చెవులూదిద్ది బొట్టూ కాటుకా పెట్టి, ఒక రవికె గుడ్డచుట్టి దానినో మరచెంబులో దూర్చి పూజలుచేసి మంగళహారతులిచ్చినంత మాత్రాన ఆ వరలక్ష్మీదేవి కోరిన వరాలిచ్చేస్తే - ఆ వేళ మధ్యాహ్నం బాడ్మింటన్ ఆడొచ్చి గుండెలో నొప్పిగా వుందని కాసిని మంచి నీళ్ళు పట్రమ్మని తెచ్చేలోగా సోడా తాగి మంచం మీద నడుంవాల్చి మరి పక్కమీదనుంచి లేవకుండానే మా కమలక్క మాంగళ్యాన్ని కూడా పట్టుకుపోయిన మా బావగారు సిమెంటు ఫ్యాక్టరీలో నాలుగొందల జీతగాడు. పండంటి సంసారాన్ని, పసిపిల్లల్నీ ఇల్లూవాకిలీ వదిలి చెప్పకుండా చెయ్యకుండా

వెళ్ళిపోయిననాడు మా కమలక్క ఏడ్చిన ఏడుపు ఆదిక్కుమాలిన కొబ్బరికాయను మ్రింగికూర్చున్న దేవతకు వినపడలేదా - సావిత్రీ గౌరీదేవిని కొల్చిందే - బొమ్మల నోము లన్నీ నోచిందే - గుళ్ళూ గోపురాలన్నీ సేవించిందే - ఏ దేవతా కరుణించలేదేఁ ఏ అమ్మ వారూ గుళ్లోంచి అభయహస్తం చూపించలేదేఁ ఏ పానకాలస్వామి ఏ రామచంద్రుడూ ఏ వెంకటేశ్వరస్వామీ మా కమలక్క తాడు తెగినపుడు ఇన్ని పూజలూ ముడుపులూ మ్రింగి కూర్చున్న ఒక్క దేవుడూ పలకలేదేఁ? పలకలేదు పలకరు. పలక్కపోతే దానిపిల్లలేమైపోతారు? ముప్పయేళ్ళు రాకుండా ముండ మోసిన మా కమలక్క బ్రతుకు నట్టేట్లో కలిసింది. దాని ముద్దూ ముచ్చట నల్లపూసలసౌరూ అన్నీ గంగలో కలిశాయి. మాకమలక్క నోచిన నోములన్నీ చేసిన వ్రతాలన్నీ దాని మొగుడ్ని ముప్పయిఅయిదేళ్ళకే కాట్లోకి చేర్చి దాని బ్రతుకు దుంపనాశనం చేశాయి. అందుకని ఈ దొంగముండా దేముళ్ళని ఈ వ్రతాల్నీ, నోముల్నీ చూస్తే నా కరికాలిమంటనెత్తి కెక్కుతుంది. మాకమలక్క ఎంతహాయిగా పాడేది తరంగాలూ కృతులూ - పచ్చగా మిసమిసలాడిపోయే ఒంటిమీద కంచి పట్టుచీరకాని, ముదురు నీలం, కెంపు, వయొలెట్ రంగు జరీచీరలు కట్టుకున్నపుడు ఆమెకుచ్చెళ్ళు, పారాణిరాసినట్లు నడిస్తే కందిపోయే ఆమెపాదాలకేసి అదేపనిగా చూడబుద్ధయేదినాకు. మా కమలక్క జడ ఆమె నడుస్తూంటే బరిమీద - త్రాచులా చెడ్డపొగరు మోతుగా బుసలు కొడుతున్నట్లు విసవిసలాడేది. బంగారాన్ని ఉలిపర కాయితంలో చుడితే మురిపించి మెరిపించినట్లు పల్చటి చీరతో ఆమె నడుము బుజాల ఒంపులు, మెడ, పాదాలు కొట్టచ్చినట్లు కనబడేవి. మా కమలక్క ఏ పెళ్ళి పందిట్లో అయినా ఎవరికో జడలు వేస్తూ, వేళాకోళాలాడుతూ ఆ పనీ ఈ పనీ కలిపించుకుని ఎంతచాకిరీ అయినా అవలీలగా నెట్టేస్తూ సంతోషంగా వూహించుకోవచ్చు. అటువంటి చిరంజీవి సౌభాగ్యవతి పంపుదగ్గర బట్టలుతుకుతూ, అంటగిన్నెలుతోముకుంటూ మాసినచీరలు కట్టుకుని, ఫిట్టొచ్చి పడిపోయినా మందు మాకూలేకుండా కసితో శరీరాన్ని నానా హింసలపాలూ చేసుకుంటూ ఏడుస్తూ జీవించడం చూస్తోంటే ఈ గుళ్ళన్నీ ఆటంబాంబు లెట్టిపేల్జేసి ఆదేవుళ్ళ నందర్నీ సముద్రంలో గిరవాటు పెట్టెయ్యాలని నా కనిపిస్తూవుంటుంది. కాని మా కమలక్క పిచ్చిది. స్నానాలుమీద స్నానాలు చేస్తూ వుంటుంది. గుళ్ళో కెళ్ళి పురాణాలు వింటుంది. ప్రతి ఏకాదశికీ తన దేవుడు పెట్టెలోని ప్రతి దేవుడ్ని చింతపండుతో తోమి ధగధగా మెరిసిపోయేలా తుడిచి అలంకరించి చూసుకుని ఆనందిస్తూ వుంటుంది. మాకమలక్క ఒకప్పుడు పూమొక్కలా నవ మోహనంగా నవ్వులరాణీలా వుండేది. ఇప్పుడామె నడుస్తున్న శవం. ఆమె నవ్వితే చేతులు రెండూ జోడిస్తే డబ్బు అప్పివ్వమని అడిగితే - ఉపోషాలుచేస్తే, పిల్లలకు చచ్చిపోయిన తండ్రి పంట్లాములు చింపి కుడితే, ఆయనలుంగీలు పంచలుచింపి చొక్కాలు పిల్లలకు చేత్తో సూదీ దారం తీసుకునికుడితే గోడమీద రాధతో ఉయ్యాల లూగుతున్న కృష్ణుడు పట్టాభిషేకం హడావిడిలో మునిగిపోయిన శ్రీ సీతారామలక్ష్మణ భరత శత్రుఘ్న పరివేష్టిత ఆంజనేయ సమేతులు, అంగనామంగ నామంతరే మాధవం అంటూ ఒక్కొక్క ఆడదానిమధ్య అవతరించిన

మాధవుడూ మేనకను త్రోసిపుచ్చుతున్న విశ్వామిత్రుడూ, వెంకటేశ్వరస్వామి అలివేలు మంగతాయారూ వెండి కొండల మీదపార్వతీ సమేతుడై కూర్చున్న ఈశ్వరుడూ యింతమందీ ఏమీ ఎరగనట్లు మాకమలక్క జీవితం కాలిపోతుంటే చూస్తూ వూరుకున్నారుకాని ఎన్నో ఎంతోమందినో కాచిన బ్రోచిన ఈగాడ్సంతా మా"కమలక్క"కి అడ్డుపడలేదేఁ. అది ఆదేవుళ్ళని యింకా కొలుస్తూనే వుంటుంది. పిచ్చితల్లీ లేకపోతే నాశనం చేసి పారేస్తా రట దానిపిల్లల్ని మ్రింగేస్తారట దేవుళ్ళకి కోపంరానివ్వకూడదట. వీళ్ళ అమ్మకడుపుమాడ. వీళ్ళకి కోపం వస్తే రానివ్వవే అక్కా ఇంతకంటే నిన్నేమిచేయగలరు - ముప్ఫయ్యేళ్ళ ముసలిదానివి నీజీవితంముక్కలూ చెక్కలూ చేసి పంచుకుతినడం ఆ దేవుళ్ళందరికీ ఇష్టమయితే వాళ్ళ ఆకలి చల్లారనీ - నీవు, నోచిన నోములు వాళ్ళకు నచ్చలేదేఁ నీపూజలు వాళ్ళమీద పనిచేయలేదే నీ కీర్తనలు వుపోషాలు ఆ దేవుళ్ళను కరిగించ గలిగితే బ్యాడ్మింటన్ ఆడొచ్చి మంచినీళ్లడిగిన నీ మొగుడు నీ చేతినీళ్ళు తాగకుండానే హరీమని ఎందుకంటాడు?

కమలక్క ఫర్ గాడ్స్ సేక్ పూజలూ పునస్కారాలూ మానేసి ఆ డబ్బు సేవ్ చేసి కాసిని పాలుకొని తోడెట్టి ఇంతమజ్జిగ చిక్కగా పొయ్యేవాళ్ళకి అన్నంలో. మొహాల్లోకి కాస్తజీవం తొంగి చూస్తుంది పిల్లలకి.

కొండెక్కి దేవుళ్ళకి కొబ్బరికాయలు కొట్టడం మానెయ్ ఆ ఏడుకొండలవాడికి బ్లాక్ మార్కెటీర్లూ సినిమాస్టారులంటే ఇష్టం నీలాంటి నాలాంటి లాకాయిలూకాయి గాళ్ళంటే ఆ దేవుడికి ఖాతర్లేదే -

బిజినెస్ మన్‌కి మంత్రులకేగాని మనలాటి ఎటిసెట్రాగాళ్ళకు తీర్థ ప్రసాదాలూ కటాక్షవీక్షణాలూ వుండవేబాబూ; జుట్టును విగ్గులుచేసి అమెరికాకు అమ్ముకునే దేవుళ్ళనుంచి దయాదాక్షిణ్యాలను ఆపేక్షించడం షీర్‌నాన్సెన్స్; ఈ గాడ్స్‌కి కూడా మన రూలర్స్ కిమల్లే దరిద్రులను కాల్చుకుతినడం హాబీ కమలక్కా - ఈ వేళ నీ బ్రతుకు తల్చుకుంటే నా కేమిటో ఆక్రోశం వచ్చేసిందే. జెరూస్లెంలో ఆక్రోశకుడ్యమని ఎడవటానికి ఓ గోడ కట్టేరుట. ఆ గోడదగ్గరకువెళ్ళి ఏడిస్తే మనశ్శాంతి లభిస్తుందట. అలాటి గోడలు మనకిఎన్నో కావాలేఁ, పోనీ అక్కడకు వెళ్ళి ఏడుద్దామంటే - జెరూస్లెం ఇక్కడుందనుకున్నావా? ఏవిటి మన కంకిపాడు దగ్గరా, మాచవరం దగ్గిరానూ, అయితే కమలక్కా మనబ్రతుకులు తల్చుకుంటే ఏ గోడకేసి తిరిగి నా ఇంట్లో ఏడుపొచ్చేస్తుందేఁ. మరిమనం వేరే ఎక్కడికి వెళ్ళనక్కర్లేదే - నాకు తెలుసులేవే - రోగం వస్తే మందు లుచ్చుకోవు. చావుకోసం ఎదురు చూస్తూకాలిపోతూన్న వత్తిలా అయిపోదామనుకుంటున్నావ్ కదూ; అందుకే ఎటుచూస్తే అటు చీకటి - చేదువిషం జీవఫలం అన్నాడు కవిగాడు. దడిగాడు వానసిరా కాదే

కమలక్క నీ జుట్టంతా రాలిపోతోందేంటేఁ

బుసలు కొట్టిన తాచుపాములావుండిన నీ జడ ఇల్లుకడిగి తుడుచుకునేందుకు వాడే మురికి చీపురులాగ ఎలాగయిందే చెప్మా? కమలక్కా -

తరుణారుణ శోభలతో విరిసిన వెన్నెల కావలసిన నీ జీవితం కొడిగట్టిన దీపం ఎలాగయిందో తల్చుకుంటే నాకు ఏడుపు ఆగటంలేదే ఏ గోడచాటుకైనా వెళ్ళి నిలబడి భోరున దుఃఖభారం దించేసుకోవాలి; అక్కా.... అక్కా....

# ధర్మ దర్శనం

నేను అట్టే చదువుకోలేదు. తెలిసీ తెలియని ఆడదాన్ని. నాకు బరువైన ఆశయాలంటూ లేవు. అది ఎందుకు ఇది ఎందుకు అంటూ క్వశ్చన్ మార్క్ కథలూ నావెల్సూ బుక్సూ అవీ రాసిపారేసి ప్రయిజులూ అవీ కొట్టేసి పేరు గడించేసి, అందరికంటె తెలివైన దాన్నని అనుకుని పెద్దా పిన్నా లేకుండా అందర్నీ తూలనాడి అందలమెక్కి కూర్చోవాలని నాకులేదు.

నావన్నీ చిన్న చిన్న కోరికలూ చిట్టిచిట్టి సరదాలూను.

నా హజ్బెండు నే గీచిన గీటు దాటితే నేనేమీ అనుకోను.

పేచీకోరు విషయాల జోలికి నేను పోను. కళ సంగీతం, నాట్యం ఇలాంటివేమీ నాకు బాగా తెలియవు.

నా ఇష్టాలు సరదాలు కొన్నైనా తీరితే నాకు అందలమెక్కి నట్లుగానే వుంటుంది. సరదాగా ఓ పుస్తకం చదువుకోవడం ఎవరేనా స్నేహితులు వస్తే కబుర్లుచెప్పుకోడం. సంతోషం కలిగించే విషయమేదైనా వుంటే మనసారా (ముఖంముటముట లాడించుకోకుండా) నవ్వటం. ఏడుపొస్తే తలగడా మంచం, పరుపూ, పక్కబట్టలూ కరిగి వరదలై పారేలా ఏడ్చేయటం భోంచేసినప్పుడు కలో గంజో – పండో – కాయో కూరోనారో– తినడం కోసవేఁపుట్టినట్లు కాకుండా – ఏదో ఒకటి తినేసి చేయి కడుక్కుని లేచి పోవాలి.

అంతేకాని తినేదానిని తినబోయేదానిని తల్చుకుంటూ జీవితం గడిపే వాళ్ళను చూస్తే నాకు పరమరోత.

వంట పొయ్యిదగ్గర పెళ్ళాం కొంగు పట్టుకు కూర్చుని కత్తి పీట కేసి చూస్తో ఆ పనీ ఈ పనీ కల్పించుకుంటూ తిరిగే అర్ధనారీశ్వరులన్నా నాకుచిరాకే.

మొగాడన్నవాడు వంటింట్లోకి బాత్‌రూంలోకి అస్తమానూ పెళ్ళాం ఏం చేస్తోందో అంటూ సి.ఐ.డి.లా అఘోరించకూడదు. స్నేహితులమధ్య – భార్యా భర్తలమధ్య, ప్రేయసీ ప్రియులమధ్య కాస్త ఎడమంటూ వుంటుంది.

ఆ ఎడం లేకపోతే నడుం విరుగుతుంది. లవ్వే వుండదు. ఆ ఎడం కడు రమ్యమైనది.

ఆ దూరాన్ని ఎవరేనా చెరిపేస్తే వాళ్ళు (ఆ ప్రేయసీ ప్రియులు) గాఢంగా జిగురెట్టి అంటించేసినట్లు అతుక్కు పోతారు.